క్లుప్తంగా

అధినేతతో...



మాజీ సీఎం జగన్‌ను కలసిన తోట నరసింహం, రాంజీ

జగ్గంపేట: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో జగ్గంపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి తోట నరసింహం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితుల గురించి, కొత్తగా ఏర్పాటు చేసిన కమిటీల గురించి ఆయనకు వివరించినట్లు తోట నరసింహం తెలిపారు. కార్యక్రమంలో యువ నేత తోట రాంజీ పాల్గొన్నారు.

సూర్యనారాయణరాజును కలసిన ముద్రగడ



దాట్ల సూర్యనారాయణరాజును కలుసుకున్న ముద్రగడ గిరిబాబు

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ పరిశీలకుడు దాట్ల సూర్యనారాయణరాజును గురువారం నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. కాకినాడలో ఆయన పార్టీ పటిష్టతపై ముద్రగడ గిరిబాబుతో చర్చించారు. పార్టీని అధికారంలోకి తీసుకు రావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని గిరిబాబు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని అన్నారు.

నందీశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేస్తున్న వేద పండితులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని గజ్జనపూడిలో నందీశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. నందీశ్వరుడి విగ్రహాన్ని స్థానిక శ్రీమతి సాగిరాజు అచ్యుతరామరాజు ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో సమకూర్చారు. ఈ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపారు. గ్రామ సర్పంచ్ గొనగాల అప్పలరాజు దంపతులు హోమాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. గజ్జనపూడి, శరభవరం పరిసర గ్రామాల భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఎన్‌కౌంటర్‌పై ఖండన

ప్రత్తిపాడు: చత్తీస్‌ఘడ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌ను సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు ఖండించారు. తక్షణమే మిలటరీ చర్యలను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక లిబరేషన్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ సీపీఐ మావోయిస్ట్ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు ఇతర కార్యకర్తలను, ఆదివాసీ ప్రజలను హత్య చేశారని అన్నారు. ఆదివాసీలను అంతమొందించేందుకు కేంద్ర ప్రభుత్వం పూనుకుంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని బంగార్రాజు డిమాండ్ చేస్తున్నారు.

డిజిటల్ అసిస్టెంట్లకు పదోన్నతులు

ప్రత్తిపాడు: స్థానిక పంచాయతీలో ఇద్దరు డిజిటల్ అసిస్టెంట్లకు గ్రేడ్- 5 కార్యదర్శులుగా పదోన్నతులు లభించాయి. ప్రత్తిపాడు- 1 సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ బత్తిన మోహన్ ధర్మేంద్ర జగ్గంపేటకు, ప్రత్తిపాడు- 2 సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ జువ్వల వీరభద్రం కిర్లంపూడి మండలం రామకృష్ణాపురం పంచాయతీకి పదోన్నతిపై బదిలీ అయ్యారని ఎంపీడీఓ కుమార్‌బాబు తెలిపారు.

ఆగిన వాన

తొండంగి: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా మండలంలో కుండపోత వర్షం కురిసింది. దీనినుంచి గురువారం కాస్త తెరిపిచ్చింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కుండపోతగా కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం వివాహ ముహూర్తాలు కూడా ఉండటంతో పలువురు తీవ్ర అవస్థలు పడ్డారు. ఈదురుగాలులకు అరటి, మామిడి తోటలకు స్వల్పంగా నష్టం వాటిల్లింది. పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపడి సరఫరాకు అంతరాయం కలగడంతో ఆ శాఖ సిబ్బంది యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు.

చెక్కుల పంపిణీ

ప్రత్తిపాడు: నియోజకవర్గంలో వివిధ గ్రామాలకు చెందిన నలుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 4,74,410 చెక్కులను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పంపిణీ చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఈ చెక్కులను ఆమె అందజేశారు.

లోడుపాట్లు లేకుండా..

- అదనపు విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు రాయితీ
- జూన్ 30తో ముగుస్తున్న గడువు
- మూడు నెలల్లో 243 మంది సద్వినియోగం



తుని మండలానికి విద్యుత్ సరఫరా చేసే తాండవ సబ్ స్టేషన్

తుని రూరల్: విద్యుత్ అదనపు లోడును స్వచ్ఛందంగా క్రమబద్ధీకరించుకునే గృహ వినియోగదారులకు 50 శాతం రాయితీ లభిస్తుంది. ఈ ఏడాది మార్చి ఒకటి నుంచి అమల్లోకి వచ్చిన రాయితీ పథకం జూన్ 30తో ముగుస్తుంది. ఈ పథకంలో వినియోగదారులకు డెవలప్‌మెంట్ చార్జీల చెల్లింపులో ఏపీ ఈపీడీసీఎల్ రాయితీ అందిస్తుంది. ట్రాన్స్‌కో తుని సబ్ డివిజన్‌లో ఉన్న ఐదు సెక్షన్ల పరిధిలో 90 వేల గృహ వినియోగదారులు రాయితీని సద్వినియోగం చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. విద్యుత్ శాఖతో కుదుర్చుకున్న ఒప్పంద లోడుకన్నా ఎక్కువ లోడు కలిగిన విద్యుత్ పరికరాల వాడకం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్లపై అదనపు భారం పడుతుంది. దీనివల్ల విద్యుత్ సరఫరాల్లో హెచ్చుతగ్గులు, ట్రాన్స్‌ఫార్మర్లలో లోపాలు, కాలిపోవడం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయి. అదనపు విద్యుత్ లోడు క్రమబద్ధీకరణతో ఏ ప్రాంతంలో ఎంతమేరకు విద్యుత్ సరఫరా చేయాలి, అందుకు అనుగుణంగా సాంకేతిక పరికరాల ఏర్పాటుతో సమస్యలను అధిగమించే అవకాశం ట్రాన్స్‌కో అధికారులకు లభిస్తుంది. దీనిని గుర్తించిన ఈపీడీసీఎల్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ కల్పించింది.

రాయితీ ఇలా..

గృహ వినియోగదారులు సాధారణంగా ఒక కిలో వాట్‌కు డెవలప్‌మెంట్ చార్జీలు రూ.2 వేలు, సెక్యూరిటీ డిపాజిట్ రూ.200 చెల్లించాలి. స్వచ్ఛంద క్రమబద్ధీకరణలో సెక్యూరిటీ డిపాజిట్‌తో కలిపి మొత్తం రూ.1200, దరఖాస్తు ఫీజు రూ.50 మొత్తం రూ.1250 చెల్లిస్తే సరిపోతుంది.

స్వల్పంగానే దరఖాస్తులు

రాయితీపై విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన గృహస్తుల సంఖ్య స్వల్పంగానే ఉంది. సబ్ డివిజన్‌లో 90 వేలకు పైగా గృహ వినియోగదారులు ఉన్నారు. మూడు నెలల కాలంలో కేవలం 243 మంది అదనపు లోడు క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసుకున్నారు. తుని సెక్షన్ పరిధిలో 125, హంసవరంలో 44, తొండంగిలో 16, కోటనందూరులో 14, అన్నవరం సెక్షన్‌లో 44 వచ్చాయి. ఇందులో 231 దరఖాస్తులను ఆమోదించిన అధికారులు వేర్వేరు కారణాలతో 12 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచారు. దీనివల్ల రూ.3.50 లక్షల వరకూ ఆదాయం సమకూరింది.

విద్యుత్ లోడు	ప్రస్తుత చార్జీలు	రాయితీతో చార్జీలు
ఒక కిలో వాట్	రూ.2,250	రూ.1,250
రెండు కిలో వాట్లు	రూ.4,450	రూ.2,150
మూడు కిలో వాట్లు	రూ.6,650	రూ.3,650
నాలుగు కిలో వాట్లు	రూ.8,850	రూ.4,850
ఐదు కిలో వాట్లు	రూ.11,050	రూ.6,050

బహుళ ప్రయోజనాలు

అదనపు విద్యుత్‌లోడు క్రమబద్ధీకరణతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. వినియోగదారులకు రాయితీ లభిస్తుంది. అధికారులు తనిఖీలు చేస్తారనే ఆందోళన ఉండదు. ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారం పడదు. హై ఓల్టేజీతో గృహోపకరణాలకు నష్టం వాటిల్లదు. నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుంది. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు తగ్గుతాయి. స్వచ్ఛందంగా అదనపు లోడు క్రమబద్ధీకరించుకునే వినియోగదారులు ట్రాన్స్‌కో రెవెన్యూ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల్లో ఈపీడీసీఎల్ వెబ్‌సైట్ www.apeastempower.comలో దరఖాస్తులు చేసుకోవాలి. తగిన మొత్తాన్ని గడువులోగా చెల్లించి అదనపు లోడు క్రమబద్ధీకరించుకోవచ్చు.

–సీహెచ్.వెంకటరమణ, ట్రాన్స్‌కో ఏఈ, తుని

ముద్రగడ పరామర్శ



ప్రత్తిపాడులో చిట్టికొండను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం

ప్రత్తిపాడు: ఇటీవల అనారోగ్యానికి గురైన డాక్టర్ అందే చిట్టికొండను గురువారం రాష్ట్ర వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం పరామర్శించారు. ప్రత్తిపాడులో ఆయన స్వగృహంలో అందే చిట్టికొండను కలసి, యోగక్షేమాలను అడిగారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, నాయకులు గణేశుల రాంబాబు, మాజీ సర్పంచ్ నీలగిరి చిట్టిబాబు, ఏడిద రెడ్డినాయుడు, పచ్చారి ప్రసాద్, రెడ్నం కోటి, కరెడ్ల ఈశ్వరరావు, ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్లు తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ నాయుడు

ప్రత్తిపాడు: వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అందిస్తున్న రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ బీజీఆర్ నాయుడు చెప్పారు. ప్రత్తిపాడు వెలుగు స్త్రీశక్తి భవనంలో గురువారం జరిగిన మహిళా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఆర్‌డీఏ డీపీఎం పద్మావతి మాట్లాడుతూ వ్యవసాయ రంగ అభివృద్ధికి బ్యాంకింగ్ సేవల అవసరాన్ని వివరించారు. వెలుగు ఏపీఎం వై.వెంకట్ మాట్లాడుతూ రుణాలతో పాటు శిక్షణా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నామన్నారు. పీఎం సురక్ష బీమా యోజన, సీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, సుకన్య సంవృద్ధి యోజన, అటల్ పెన్షన్ యోజన గురించి వివరించారు. యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ కె.వెంకటేశ్వర్లు, స్థానిక యూబీఐ మేనేజర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు అందక అష్టకష్టాలు



జగ్గంపేటలో ఉపాధి కూలీల కష్టాలపై మాట్లాడుతున్న జుత్తుక నాగేశ్వరరావు

జగ్గంపేట: మండలంలో ఉపాధి కూలీలకు వేతనాలు సక్రమంగా అందడం లేదని, తక్షణం అధికారులు చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ వాద్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తుక నాగేశ్వరరావు తెలిపారు. జగ్గంపేటలో పంచాయతీరాజ్ అతిథి గృహం వద్ద పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసినప్పుడు వారి కష్టాలను ఏకరవు పెట్టారని అన్నారు. గత ప్రభుత్వంలో వేతనాలు సక్రమంగా అందేవని కూలీలు అంటున్నారని, కూటమి ప్రభుత్వంలో ఇబ్బంది ఎదురవుతుందని చెప్పారు. ఏప్రిల్ వేతనాలు ఇప్పటి వరకూ పడలేదని ఆయన అన్నారు. వేసవిలో గతంలో కూలీలకు మజ్జిగ ఇచ్చేవారని, అలాగే ఎండ వేడిమి తట్టుకొనేందుకు భోజన సమయంలో టార్పాలిన్లు వేసే వారని అవి కూడా లేవన్నారు. పేద కూలీల పట్ల నిర్లక్ష్యం తగదని అన్నారు.

సమగ్ర వ్యవసాయ విధానాలతో మేలు



శంఖవరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ గాంధీ

శంఖవరం: సమగ్ర వ్యవసాయ విధానాలతో రైతులకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ అన్నారు. మండలంలో శంఖవరం, వి.వెంకటాపురం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు బహుళ పంటల సాగుతో ఆదాయంతో పాటు భూసారం వృద్ధి చేసుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా అనేక లాభాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది సోమరాజు, లోవలక్ష్మి, బాబూరావు, సుబ్బారావు, నాగలక్ష్మి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక వికాసం



ప్రత్తిపాడులో యోగాసనాలు వేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



జగ్గంపేట సర్కిల్ పరిధిలో పోలీసులు, సిబ్బందికి యోగా శిక్షణ

ప్రత్తిపాడు: యోగాతోనే మానసిక, శారీరక వికాసం సాధ్యపడుతుందని ప్రత్తిపాడు ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ తెలిపారు. ప్రపంచ యోగా మాసోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు మాట్లాడుతూ వచ్చే నెల 21న ప్రపంచ యోగా దినోత్సవం రోజున విశాఖ యోగా డేలో ప్రధాని, సీఎంలు పాల్గొంటారని చెప్పారు. దానిని పురస్కరించుకుని నెలరోజుల పాటు గ్రామాల్లో యోగాతో కలిగే ప్రయోజనాలను తెలుపుతూ ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. ఈ సదస్సులో రాచపల్లి, శాంతి ఆశ్రమం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు వై.గీతా సుధ, మురళీమనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ధర్మవరం గ్రామానికి చెందిన దొడ్డిపట్ల సోమన్నదొర అధికారులు, కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది తదితరులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు.

పోలీసు సిబ్బందికి శిక్షణ

జగ్గంపేట: యోగా మాసోత్సవాలను పురస్కరించుకుని స్థానిక కాపు కల్యాణ మండపంలో జగ్గంపేట పోలీస్ సర్కిల్ పరిధిలోని సిబ్బంది, ఉద్యోగులు, ప్రజలకు యోగాలో శిక్షణ ఇచ్చారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో యోగా గురువులు సీతారామస్వామి, మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. పోలీస్ సర్కిల్ పరిధిలోని ఎస్సైలు జి.సతీష్, రఘునందనరావు, శివనాగబాబు, వెల్‌నెస్ కోచ్ శృతి తదితరులు పాల్గొన్నారు.

రైతు కష్టం... కన్నీటి మయం



వీకే రాయపురంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

సామర్లకోట: నాలుగు రోజులుగా కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఈ ధాన్యంలో మొలకలు రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు తడిసిన ధాన్యం పరిస్థితిపై భరోసా ఇవ్వాల్సిన అధికారులు, సిబ్బంది ఇటుగా రావడం లేదని వీకే రాయపురం రైతులు ఇంటి వెంకట్రావు, వెలమర్తి బుల్లి రాజు, తలారి దొరబాబు, రేలంగి రాంబాబులు ఆరోపిస్తున్నారు. ధాన్యం నూర్పిడి చేసి 15 రోజులుగా కళ్లాల్లోనే ఉన్నా అధికారులు పట్టించుకోక పోవడంతోనే ధాన్యం తడిసి ముద్దయ్యిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 16 శాతం తేమ ఉన్న ధాన్యాన్నే రూ.1500కు కొనుగోలు చేసిన దళారులు తడిసిన ధాన్యానికి ఏరేటు కడతారోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందించడంలో మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలులోనూ మొండిచేయి చూపింది. గురువారం మధ్యాహ్నం నుంచి కొద్దిపాటి తెరుపు ఇవ్వడంతో ధాన్యం ఆరబెట్టుకునే పనిలో రైతులు ఉన్నారు.

సత్యదేవుని సన్నిధిలో సాయికుమార్



సినీనటుడు సాయికుమార్‌కు సత్యదేవుని చిత్రపటం అందిస్తున్న ఈఓ సుబ్బారావు

అన్నవరం: ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ కుటుంబ సభ్యులతో కలసి గురువారం రత్నగిరిపై సత్యదేవుడిని దర్శించి పూజలు చేశారు. తొలుత ఆలయం వద్ద ఆయనకు పండితులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ఫొటోను ఈ వీర్ల సుబ్బారావు బహూకరించారు. అలాగే స్వామివారిని రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర దర్శించుకున్నారు.

జగ్గంపేట ఎస్సైకి ప్రశంసలు



ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్సై రఘునందనరావు

జగ్గంపేట: క్రైమ్ రేటు తగ్గించడంలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచినందుకు జగ్గంపేట ఎస్సై రఘునందనరావును జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు. ఈ మేరకు గురువారం కాకినాడ జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్సై రఘునందనరావుకు ఎస్పీ ప్రశంసాపత్రాన్ని అందించారు.

క్రైమ్ టీమ్‌కు ఎస్పీ రివార్డులు

సామర్లకోట: పెద్దాపురం డివిజన్ క్రైం టీమ్‌కు ఎస్పీ బిందుమాధవ్ గురువారం రివార్డులు అందజేశారు. ఇటీవల రూ.10.24 లక్షల సొత్తు చోరీ జరగ్గా, 24 గంటల్లోనే కేసును పోలీసులు ఛేదించారు. దాంతో సామర్లకోట క్రైం స్టేషన్ సీఐ అంకబాబు, ఏఎస్సై బలరామ్, హెచ్‌సీలు రాధాకృష్ణ, శ్రీహరిలకు ఎస్పీ రివార్డులు అందజేశారు. ఈ మేరకు రివార్డులు అందుకున్న వారిని పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు అభినందించారు. అన్నవరం బస్ కాంప్లెక్స్ వద్ద గుంటూరుకు చెందిన బోడపాటి నాగేశ్వరరావు అనే ప్రయాణికుడి బ్యాగ్ కోసి రూ.10 లక్షలు అపహరించిన విషయం విదితమే. తునిలో బస్సు ఎక్కి అన్నవరంలో దిగి గుంటూరు బస్సు కోసం నాగేశ్వరరావు వేచి ఉన్న సమయంలో బ్యాగ్‌ను విశాఖపట్నంకు చెందిన కంబాల శ్రీను అపహరించాడు. నిందితుడిని పట్టుకున్న క్రైమ్ టీమ్‌కు రివార్డు దక్కింది.

రామభక్తాయ... వాయుపుత్రాయ

- భక్తిశ్రద్ధలతో హనుమద్ జయంతి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు



తంటికొండ దేవస్థానంలో క్షేత్రపాలకుడు అభయాంజనేయస్వామి



మల్లేపల్లిలో వివిధ వేషధారణలతో ఊరేగింపు



శంఖవరంలో ఆంజనేయునికి పూజలు చేస్తున్న భక్తులు



తపోవనం ఆశ్రమంలో ఆంజనేయస్వామి



గోపాలపట్నంలో హనుమంతుడు



ఏలేశ్వరంలో అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఎంపీపీ బుజ్జి, భక్తులు



గండేపల్లిలో చెరువు గట్టుపై..

గండేపల్లి: భజే వాయుపుత్రా... భజే రామభక్తయా అంటూ ఆ ప్రసన్నాంజనేయ స్వామిని భక్తజనం కొలిచింది. గురువారం హనుమద్ జయంతి వేడుకలు అంబరాన్నంటాయి. గండేపల్లిలో చెరువు గట్టుపై అభయ ఆంజనేయస్వామి వారికి, మల్లేపల్లిలో హైవేను ఆనుకుని ఉన్న ఆలయం వద్ద, తాళ్లూరు రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి తమలపాకుల, సిందూర పూజలు చేశారు. మల్లేపల్లి, తదితర గ్రామాల్లో నిర్వహించిన అన్న సమారాధనలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉత్తరాఖండ్ నుంచి హరిద్వార్ వెళుతున్న అఘోరాకు గండేపల్లి అయ్యప్ప స్వామి ఆలయంలో బొల్లంరెడ్డి రామకృష్ణ, గ్రామస్తులు ఆశ్రయం కల్పించి పండ్లు అందజేశారు. మల్లేపల్లిలో ఆంజనేయుని, వివిధ వేషధారణల్లో ఓ యువకులు ఆకట్టుకున్నారు.

తుని రూరల్: హనుమద్ జయంతి సందర్భంగా ఎస్.అన్నవరం, కుమ్మరిలోవ, తపోవనం, డి.పోలవరం, తేటగుంట, జిల్లేడుపాడు, కేఓ మల్లవరం, లోవ దేవస్థానం తదితర గ్రామాల్లో ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో అన్న సమారాధనలు జరిగాయి.

తొండంగి: బెండపూడి కృష్ణాలయం సెంటర్లో భక్తాంజనేయ భజన సమాజం మహిళలు, గ్రామస్తులు నాగవల్లీ దళాలతో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా కొమ్మనాపల్లి, సీతారాంపురం, గోపాలపట్నం, వేమవరం, దానవాయిపేట, ఏవీ నగరం, పీఈ చిన్నాయపాలెం, రావికంపాడు, తొండంగి సినిమాహాల్ సెంటర్ ఆంజనేయస్వామి ఆలయం, ఎల్లయ్యపేట, అద్దరిపేట తదితర గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఏలేశ్వరం: స్థానిక షిర్డీనగర్‌లోని గాంధీ విగ్రహం సమీపంలోని సుమారు 13 అడుగుల భారీ అభయాంజనేయస్వామి వారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్, పైల విజయ్‌కుమార్, చిక్కాల లక్ష్మణరావు, కొప్పుల బాబ్జీ తదితరులు పాల్గొన్నారు. స్థానిక మార్కెట్ వీధిలోని అభయాంజనేయ స్వామివారి ఆలయం వద్ద అర్చకుడు పొన్నూరు వెంకటాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద స్వామివారి ఆలయం వద్ద వేడుకలు చేశారు. లింగంపర్తి తోటవీధిలో హనుమద్ జయంతిని నిర్వహించారు.

కిర్లంపూడి: స్థానిక ఆంజనేయస్వామి ఆలయాన్ని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగపతినగరంలోని సోమరాయణంపేట రామాలయం వద్ద ఆంజనేయ విగ్రహానికి భక్తులు పూజలు చేశారు.

గోకవరం: స్థానిక ప్రధాన రహదారి చెంతన దాసాంజనేయస్వామి ఆలయంలో అర్చకులు ఆరవిల్లి సీతారామాచార్యులు, డాక్టర్ వల్లూరి జగన్నాధశర్మ, శ్రీనివాస్‌శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తంటికొండలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ క్షేత్రపాలకుడు అభయాంజనేయస్వామి ఆలయంలో అభిషేకాలు చేశారు. దేవస్థానం మాజీ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర, సువర్ణతులసీ దంపతులు పూజలు నిర్వహించారు. వీరలంకపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నదానం చేశారు.

శంఖవరం: మండల వ్యాప్తంగా హనుమద్ జయంతి వేడుకలు జరిగాయి. ఉదయం నుంచి భక్తులు ఆంజనేయస్వామి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.